క్లుప్తంగా

కబడ్డీ విజేత బండిఆత్మకూరు



విజేత బండిఆత్మకూరు జట్టు

పాములపాడు: ఈస్టర్ పండుగ సందర్భంగా మండలంలోని వేంపెంట గ్రామంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి సీనియర్ కబడ్డీ పోటీల్లో విజేతగా బండిఆత్మకూరు జట్టు నిలిచింది. మంగళవారం పోటీలు ముగియగా విజేతలకు నగదు బహుమతులను కమిటీ నిర్వాహకులు అందజేశారు. మొదటి విజేత బండిఆత్మకూరు కు రూ.30,000 (దాత శాప్‌చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి) రెండో బహుమతి రేగడగూడూరు కూ.20,000(వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సుధీర్ దారా), మూడో విజేత గోనెగండ్ల రూ.15,000(దాత వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి), నాల్గవ విజేత వేంపెంట రూ.10,000 (దాత తుమ్మలూరు సర్పంచు వరప్రసాద్) చొప్పున బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు సౌందర్‌రాజు, భాస్కర్, సురేష్, ఓడులేసు, సిరిఅన్న తదితరులు పాల్గొన్నారు.

కుమారస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేషక్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

మహానందీశ్వర దంపతులకు ఏకాంతసేవ పూజలు

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి సహిత శ్రీ మహానందీశ్వర స్వామి వార్లకు మంగళవారం రాత్రి ఏకాంత సేవ పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, అర్చకులు స్వామి, అమ్మవార్ల మూర్తులను పట్టువస్త్రాలతో, పుష్పాలతో అలంకరించారు. స్థానిక యాగశాలలో ఏకాంత సేవ పూజలను చేశారు. పూజల అనంతరం భక్తులకు స్వామి, అమ్మవార్ల ప్రసాదాలను అందించారు.

మహానందిలో కన్నడిగుల సందడి



మహానందీశ్వరుడి దర్శనార్థం వస్తున్న కన్నడ భక్తులు

మహానంది: ఉగాది సమీపిస్తున్న నేపథ్యంలో కన్నడ భక్తులు మహానందికి తరలివస్తున్నారు. మంగళవారం వేలాది సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణాలు కళకళలాడాయి. ప్రతి ఏడాది ఉగాది పర్వదినం సందర్భంగా లక్షలాది సంఖ్యలో కన్నడిగులు మహానందికి తరలివస్తారు. అందులో భాగంగా వేలాది సంఖ్యలో కన్నడ భక్తులు పాదయాత్ర, వాహనాలలో వస్తున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు శ్రీ కామేశ్వరీదేవి సహిత శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు నిర్విరామంగా భక్తులరద్దీ కొనసాగింది. మహానందీశ్వరుడి దర్శనం అనంతరం వారు శ్రీశైలం ఆలయానికి తరలివెళ్లారు.

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోండి

నంద్యాల: జిల్లాలో అత్యధికంగా 43.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్న నేపథ్యంలో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ కె.శ్రీనివాసులు జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. వడగాలులపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని కార్యాలయాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు బయట తిరగకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. వైద్య ఆరోగ్య, డీఈఓ, ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్, లేబర్, డీఆర్‌డీఏ, డ్వామా, మెప్మా, పశుసంవర్ధక, విద్యుత్‌శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించాలన్నారు. పీహెచ్‌సీల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పనులను ఉదయం 10:30 గంటల్లోపు ముగించాలని ఆదేశించారు. జేసీ రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్‌ఓ పద్మజ, ఆర్డీఓలు పాల్గొన్నారు.

శ్రీశైలం నియోజకవర్గంలో టీడీపీకి భారీ షాక్

- వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు
- త్వరలో వైఎస్సార్‌సీపీలో చేరనున్న ముస్లిం మైనార్టీ నాయకుడు అహ్మద్‌హుసేన్
- ఆయన కుమారులు, అనుచరులు



అహ్మద్‌హుసేన్

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గంలో ఇప్పటికే టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు కొనసాగుతుండగా తాజాగా ఆ పార్టీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ అహ్మద్ హుసేన్ త్వరలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరనున్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి కార్యకర్తగా పని చేశారు. 35 సంవత్సరాలుగా వివిధ పదవుల్లో కొనసాగారు. ఉమ్మడి రాష్ట్రంలో మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్‌గా, ఏపీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్, ఏపీ స్టేట్ హజ్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. టీడీపీ మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ గాను, పార్టీ స్టేట్ జనరల్ సెక్రెటరీగా, కడప అబ్జర్వర్‌గా 14 సంవత్సరాలు, అనంతపురం జిల్లాకు టీడీపీ ఇన్‌చార్జ్‌గా 12 సంవత్సరాల పాటు కొనసాగారు. ఆర్టీసీ ట్రేడ్‌యూనియన్ లీడర్‌గా 20 సంవత్సరాలు పనిచేశారు. ఆయన కుమారుడు మోమిన్ ముస్తఫా టీడీపీ రాయలసీమ సొసైటీ మీడియా ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. వీరు త్వరలో ఆ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే ఎమ్మెల్యేతో జరిపిన చర్చలు జయప్రదం కావడంతో వైఎస్సార్‌సీపీలో చేరడం ఇక లాంఛనమే. ఆయనతో పాటువందలాది మంది కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలోకి రానున్నారు. ఆయన వైఎస్సార్‌సీపీలో చేరితే మైనార్టీ వర్గాల్లో పార్టీకి మరింత బలం చేకూరుతుంది.





ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన బోయరేవుల టీడీపీ నాయకులు , ఆత్మకూరు 15వ వార్డుకు చెందిన కుటుంబాలు

ఆదర్శమండలంగా తీర్చిదిద్దాం..

ఎన్నో ఏళ్లగా అభివృద్ధికి దూరంగా ఉన్న వెలుగోడు మండలాన్ని ఆదర్శంగా నిలిపామని ఎమ్మెల్యే శిల్పా అన్నారు. బోయరేవుల గ్రామస్తులు పార్టీలో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేల్పనూరు, వెలుగోడు గ్రామాలలో నూతన వైద్య శాలలను నిర్మించామని, సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించామన్నారు. ఇది అభివృద్ధి కాదా అని, ప్రతి పక్ష నాయకుల కళ్లకి కనిపించవా అని విమర్శించారు. ఇదే గ్రామంలో 750 కుటుంబాలు నివసిస్తుంటే గతంలో మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి 500ల కుటుంబాలు టీడీపీలో చేరినట్టు తప్పుడు రాతలు రాయించుకున్నాడని మండి పడ్డారు. బోగస్ చేరికలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ప్రజలు వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అంబాలప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, మాజీ సర్పంచ్ ముంతల విజయభాస్కర్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ రమణ, అడ్వొకేట్ సుధాకర్‌రెడ్డి, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బోయరేవులలో 100 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

వెలుగోడు: తెలుగు దేశం పార్టీకి బోయరేవుల గ్రామంలో పెద్ద షాక్ తగిలింది. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి సొంత మండలంలో ఏకంగా 100 కుటుంబాలు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పాయి. బోయరేవుల గ్రామంలో గత 30 సంవత్సరాలుగా టీడీపీలో కొనసాగుతున్న గ్రామ మాజీ సర్పంచులు పోతుల రమణారెడ్డి, ఆయన సతీమణి పోతుల సరస్వతి అధ్వర్యంలో 100 కుటుంబాలు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. వీరికి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి డమ్మీ చేరికలతో ఆర్భాటాలు చేస్తున్నారని పార్టీలో చేరిన నాయకులు విమర్శించారు. సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పాలనకు ఆకర్శితులై..వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చుకునేందుకు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు టీడీపీని వీడిన నేతలు తెలిపారు. గత 30సంవత్సరాలుగా తెలుగు దేశం పార్టీలో ఏమి అభివృద్ధి కనిపించలేదని ఈ గత 5 సంవత్సరాలలో జగనన్న సంక్షేమ పథకాలు అద్భుతంగా ఉన్నాయన్నారు. అందుకే పార్టీలో చేరామన్నారు. .

ఆత్మకూరులో 80 కుటుంబాలు చేరిక

ఆత్మకూరు: పట్టణంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి సమక్షంలో మంగళవారం భారీగా చేరికలు జరిగాయి. టీడీపీ నుంచి 80 కుటుంబాల సభ్యులు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తల మనోభావాలు దెబ్బతినకుండా వారికి అండగా ఉంటామన్నారు. ఎన్నికల సమయంలో తనకు అండగా ఉండేందుకు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరడం సంతోషంగా ఉందని చెప్పారు. పట్టణంలోని 15వ వార్డుకు చెందిన అక్కిరాజు కాలనీకి చెందిన కువ్వాడ భాస్కర్ ఆధ్వర్యంలో 80 కుటుంబాల సభ్యులు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జోసెఫ్, రఫీక్, వలి, ఫకృద్దీన్, సంపత్, శ్యామ్ పాల్గొన్నారు.



పి.లింగాపురంలో వృద్ధురాలితో ఆప్యాయంగా మాట్లాడుతున్న దారా సుధీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు

జగనన్న వెంటే జనం

- గెలుస్తానని నమ్మకంలేకే చంద్రబాబు పొత్తులు
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్
- పి.లింగాపురం, కొత్తసిద్ధేశ్వరం, కేకేకొట్టాల గ్రామాల్లో ప్రచారం

జూపాడుబంగ్లా: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసిన సంక్షేమ పథకాలు నేరుగా ప్రజలకు చేరినందుకే జనమంతా జగనన్న వెంటే ఉన్నారని నందికొట్కూరు ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్ అన్నారు. జగనన్న ఐదేళ్ల పాలనలో మీ కుటుంబానికి మేలు జరిగిందని భావిస్తే ఫ్యాను గుర్తుకు ఓటువేయాలని కోరారు. మంగళవారం మండలంలోని పి.లింగాపురం, కొత్తసిద్ధేశ్వరం, కనకయ్యకొట్టాల గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ఫ్యాను గుర్తుకు ఓటువేసి జగనన్నను మరోమారు సీఎంగా ఆశీర్వదించడంతో పాటు తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గెలుస్తాననే నమ్మకం లేకే చంద్రబాబు.. జనసేన, బీజేపీలతో పొత్తుపెట్టుకున్నాడని ఎద్దేవా చేశారు. నియోజకవర్గంలోని 95శాతం ఓటర్లు జగనన్నే మళ్లీ సీఎం కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. జగనన్న పాలనలో పైసా ఖర్చులేకుండా, ఎలాంటి రెకమెండేషన్ లేకుండా అర్హతే ప్రామాణికంగా పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలిచ్చారన్నారు. చంద్రబాబుపాలనలో లంచాలిచ్చిన వారికి, పచ్చచొక్కాలు వేసుకొన్న వారికిమాత్రమే సంక్షేమ పథకాలిచ్చేవారని గుర్తు చేశారు. అలాగే గ్రామాల్లో ఎన్నడూ లేని విధంగా సిమెంటు రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి వసతి, సచివాలయాలు, హెల్త్‌క్లినిక్, రైతుభరోసా, వంటి ఆధునిక భవనాల నిర్మాణంతో గ్రామాల్లో అభివృద్ధి జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ సెక్రెటరీ కోసిక తిరుమలేశ్వరరెడ్డి, జేసీఎస్ మండల అధ్యక్షుడు, సర్పంచ్ నాగార్జునరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు తోకల కృష్ణారెడ్డి, కోసిక తరుణ్‌కుమార్ రెడ్డి, రమేష్‌రెడ్డి, నరసింహాయాదవ్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నిజం చేసిన జగనన్న

- ఏపీ శాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి
- టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



వైఎస్సార్‌సీపీలో చేరిన పారుమంచాల గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు

నందికొట్కూరు: పేదల సొంతింటి కల నిజం చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని శాప్ రాష్ట్ర అధ్యక్షులు, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జూపాడుబంగ్లా మండలం పారుమంచాల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పోచా స్వామిరెడ్డి, జెడ్పీటీసీ జగదీశ్వరరెడ్డి, పోచా హేమశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సమక్షంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు మాదవరం రాయప్ప, మాధవరం ప్రసాద్, మాధవరం మరిదదాస్, శేషన్న, మాధవరం పుల్లయ్య, మాధవరం జానయ్య, మాధవరం గురుస్వామి, మాధవరం పవన్, మాదవరం మునిస్వామి, గుడెపోగు ఇమ్మానియేల్, సామేల్, రమేష్, సురేష్, చిన్నరాముడు, చిట్టెన్న, రంగన్న, మధు, భరత్, చిన్న, వీరాపురం వెంకటేశ్వర్లు వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు సిద్ధార్థరెడ్డి వైఎస్సార్‌సీపీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

బస్సుయాత్రకు వస్తున్న జనాన్ని చూసి చంద్రబాబుకు వణుకు

మేమంతా సిద్ధం బస్సుయాత్రకు వస్తున్న జనాన్ని చూసి చంద్రబాబుకు వణుకు పుట్టిందని సిద్ధార్థరెడ్డి అన్నారు. నియోజకవర్గంలో రోజు రోజుకు టీడీపీ నుంచి నాయకులు, కార్యకర్తల చేరికలు పెరుగుతున్నాయని చెప్పారు. ఇంటింటికీ ఉద్యోగం ఇస్తానని చెప్పి మోసం చేసిన చంద్రబాబుకు యువత బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. 2014లో రైతుల రుణామాఫీ చేస్తానని మోసం చేయలేదా అని గుర్తు చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లింలకు ఇచ్చిన నాలుగు శాతం రిజర్వేషన్లు చంద్రబాబు ఎత్తివేయాలని కుట్రపన్నుతున్నారన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన తలుపు తట్టి అవ్వాతాతలకు, వితంతువులకు, వికలాంగులకు, ఒంటరి మహిళలకు పింఛన్లు ఇస్తున్న ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమని చెప్పారు.

కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు

- ఏబీఎం పాలెంలో శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ప్రచారం
- ముఖ్యనాయకుల ఇంటికి వెళ్లి వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేయాలని పిలుపు

నందికొట్కూరు: కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదల గుండెల్లో నిలిచారని శాప్ రాష్ట్ర చైర్మన్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. మంగళవారం ఏబీఎం పాలెంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సిద్ధార్థరెడ్డికి ఘన స్వాగతం పలికారు. ముఖ్య నాయకుల ఇంటింటికి వెళ్లి పార్టీ గెలుపునకు సహకరించాలని బైరెడ్డి సిద్ధార్థరెడ్డి కోరారు. సీఎం వైఎస్ జగనన్న పాలనలో పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని గుర్తు చేశారు. పేదలకు చంద్రబాబు ఏమి చేశారో అందరికీ తెలిసిందేనన్నారు. అర్హులైన అన్ని రకాల పేదలకు వలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ చేయకుండా చంద్రబాబు కోర్టుకు వెళ్లడం మీకే తెలుసన్నారు. ఏబీఎం పాలెంలో అందరినీ కలుపుకొని మంచి మెజార్టీ తేవాల్సిన బాధ్యత మీపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు చిన్నరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు అబుబక్కర్, చంద్రమౌళి, స్థానిక నాయకులు రామకృష్ణ, ఉపేంద్రారెడ్డి, విజ్జి తదితరులు పాల్గొన్నారు.



ఘన స్వాగతం పలుకుతున్న ఏబీఎం పాలెం మహిళలు

బడీరాత్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి



ముస్లింలను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నందికొట్కూరు: ముస్లింలు ప్రశాంతంగా బడీరాత్ పండుగను జరుపుకోవాలని ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం పట్టణంలోని పోలీసు స్టేషన్ ఆవరణలో ముస్లిం మత పెద్దలతో ఏర్పాటు చేసిన పీస్ కమిటీ సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. బడీరాత్ పండుగ సందర్భంగా ఎలాంటి సమస్యలకు తావులేకుండా ప్రార్థనలు చేసుకోవాలన్నారు. ఇబ్బందులు వస్తే వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐలు విజయభాస్కర్, ప్రకాష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బండిఆత్మకూరులో నేడు ఎమ్మెల్యే శిల్పా పర్యటన

మహానంది: ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి బుధవారం బండిఆత్మకూరుకు రానున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బారెడ్డి శ్రీనివాసరెడ్డి మంగళవారం తెలిపారు. బండిఆత్మకూరులోని వీవర్స్ కాలనీ(కొత్తకొట్టాల)లో పర్యటిస్తారన్నారు. ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు.

మండుటెండలో మల్లన్న చెంతకు



మండుటెండను లెక్కచేయక వడి వడిగా అడుగులేస్తూ శ్రీశైలం వెళ్తున్న కన్నడభక్తులు

జూపాడుబంగ్లా: భ్రమరాంబికామాత పుట్టింటివారైన కన్నడిగులు స్వామి, అమ్మవార్లపై ఉన్న భక్తితో మండుటెండలను లెక్కచేయక వందలకిలో మీటర్లు కాలినడకన వెళ్లడాన్ని చూసి ఆశ్చర్యచికితులవుతున్నారు. కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి వందల కిలోమీటర్లు కాలినడక మండుటెండల్లో నడుచుకుంటూ అమ్మవారికి పసుపు, కుంకుమ తీసుకొని శ్రీశైలం వెళ్తున్నారు. కొంత మంది భక్తులు స్వామి, అమ్మవార్లపై భక్తితో చెక్కకాళ్లతో వెళ్తుండగా, మరికొంత మంది స్వామివారి పల్లకీని భుజానికి ఎత్తుకొని పయనిస్తున్నారు. మరికొంత మంది భక్తులు స్వామివారికి బసవన్నలను కానుకగా తీసుకొని వెళ్తున్నారు. ఇలా ఎవరికి తోచిన రీతిలో వారు భక్తిని చాటుకుంటూ మండుటెండల్లో అలుపెరగకుండా ప్రయాణిస్తూ పుట్టింటి చీర, సారె కోసం వేచిచూస్తున్న శ్రీశైల భ్రమరాంబికా, మల్లన్న స్వామివార్ల చెంతకు వడివడిగా కన్నడిగులు సాగిపోతున్నారు.



స్వామివారిని పల్లకీలో కూర్చొండబెట్టుకొని శ్రీశైలం వెళ్తున్న భక్తులు

గ్రామాల్లో పోలీసుల కవాతు



ఎదురుపాడులో పోలీసు కవాతు చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని ఎదురుపాడు, జడ్డువారిపల్లె, కొక్కెరంచ, దుద్యాల, కొత్తమాడుగుల గ్రామాలలో మంగళవారం ఎస్ఐ హరిప్రసాద్ ఆధ్వర్యంలో బీఎస్ఎఫ్ బలగాలు కవాతు నిర్వహించాయి. వీధుల వెంట పోలీసులు కవాతు చేస్తూ ఎన్నికల నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాలలో అసాంఘిక కార్యకలపాలు, నాటుసారా, అక్రమమద్యం విక్రయాలు నేరపరిగణలోకి వస్తాయన్నారు. అలా చేసినవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అమ్మవారికి అంబలి సమర్పణ

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని బాల్కొండ హాల్లో వెలసిన కోటా సుంకులాపరమేశ్వరికి మంగళవారం భక్తిశ్రద్ధలతో అంబలి సమర్పించారు. ఉదయాన్నే అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృత అభిషేకాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. అనంతరం పట్టు వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

పాదయాత్రికులకు అన్నదానం

పాములపాడు: శ్రీశైలం పూసల నిత్యాన్నదాన సేవా సత్రం ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని యర్రగూడూరు గ్రామం వద్ద కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో పాదయాత్రికులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం గౌరవాధ్యక్షుడు, అధ్యక్షుడు రాజశేఖర్, రామస్వామి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు కాలినడకన శ్రీశైలం వెళ్తున్నారన్నారు. వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అంతే కాకుండా నొప్పులు, ఇతర రోగాలకు సంబంధించి ఆరోగ్య శిబిరం కూడా ఏర్పాటు చేసి వైద్య సేవలందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మధుసూదన్‌రావు, కుశాయప్ప, రాజు, పెద్దస్వామి, పుల్లం రాజు పాల్గొన్నారు.



కన్నడ పాద యాత్రికులకు అన్నదానం చేస్తున్న పూసల కమిటీ నాయకులు

కడమలకాల్వలో ఐదు గుడిసెలు దగ్ధం



కాలిపోతున్న గుడిసెలు



కట్టుబట్టలతో మిగిలిన ఓ కుటుంబం

మహానంది: విద్యుత్ షాక్‌తో ప్రమాదవశాత్తు ఐదు గుడిసెలు దగ్ధం కావడంతో పేదలంతా కట్టుబట్టలతో మిగిలిన సంఘటన బండిఆత్మకూరు మండలం కడమలకాల్వలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... కడమలకాల్వ గ్రామానికి చెందిన పొన్నకంటి వరలక్ష్మి, జమ్మక్క, చెన్నూరు లీలమ్మ, నల్లబోతుల పద్మావతి, మేకల నాగలక్ష్మమ్మ కుటుంబాలు కూలీ పనులకు వెళ్లి జీవనం సాగిస్తున్నారు. అయితే రాత్రి ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అవడంతో ముందుగా మేకల నాగలక్ష్మమ్మ ఇంట్లో మంటలు చెలరేగాయి. రాత్రి, గాలి బాగా వీస్తుండటంతో క్షణాల్లో మంటలు వ్యాపించాయి. దీంతో పక్కపక్కనే ఉన్న మరో నాలుగు గుడిసెలకు మంటలు చుట్టుముట్టడంతో కళ్లెదుటే కాలిపోవడం చూసిన ఆ పేదలు భోరున విలపించారు. స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఒక్క వస్తువంటే ఒక్క వస్తువును ఇంట్లో నుంచి తీసుకోలేకపోయామని బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. కష్టపడి దాచుకున్న నగదు, వస్తువులన్నీ బూడిదవడంతో సుమారు రూ.ఆరు లక్షలకు పైగా నష్టం వాటిల్లింది. ఇదిలా ఉండగా పిల్లాపాపలతో కలిసి బయట నిద్రించడంతో ప్రాణాలతో బయటపడ్డారు.

సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ తప్పనిసరి

బొమ్మలసత్రం: బైక్‌పై ప్రయాణించే సమయంలో హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలకు రక్షణగా ఉంటుందని ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో జరిగే రోడ్డు ప్రమాదాల్లో అధికంగా బైక్ ప్రమాదాలే ఉన్నాయని తెలిపారు. ఎక్కువ శాతం హెల్మెట్ ధరించని వారే ఉన్నారన్నారు. వీటిని నివారించేందుకు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. బైక్ నడపడానికి ముందు తమ కుటుంబ సభ్యులను గుర్తుచేసుకుని వారికి తామే ఆధారమని భావించి హెల్మెట్ ధరిస్తే ఎలాంటి ప్రమాదం జరిగినా ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా ఉంటుందన్నారు. హెల్మెట్ ధరించకుంటే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనాలపై అతివేగం కూడా ప్రమాదకరమన్నారు. ముందుగా బయలుదేరి నెమ్మదిగా గమ్యస్థానానికి చేరుకోవడం శ్రేయస్కరమని పేర్కొన్నారు.

కన్నడిగులకు అన్నదానం

నందికొట్కూరు: ఉగాది పండుగ సందర్భంగా శ్రీశైలం పుణ్యక్షేత్రానికి కాలినడకన వెళ్తున్న కన్నడ భక్తులకు పట్టణంలోని శ్రీచౌడేశ్వరి దేవాలయంలో కమిటీ ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం, వికలాంగుల ఆధ్వర్యంలో చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. రిటైర్డు జడ్జి మోహన్‌రావు భక్తులకు మజ్జిగ పంపిణీ చేసి మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ ఆర్ట్ శ్రీను, సినిమా థియేటర్ యజమాని రామిరెడ్డి, రిటైర్డు టీచర్ శివరాముడు, వృద్ధాశ్రమం నిర్వాహకులు ధర్మారెడ్డి, దివ్యాంగుల సంఘం అధ్యక్షులు నాగన్న, గౌరవాధ్యక్షులు చంద్రశేఖర్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



చల్లని మజ్జిగ పంపిణీ చేస్తున్న రిటైర్డు జడ్జి